JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | సోమవారం 16-03-2026
Medchal - Malkajgiri | Monday 16-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 289
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 289 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





# మొయినాబాద్ డ్రగ్స్ పార్టీ

- టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా ఆరుగురికి పాజిటివ్
- 11 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు..
- పోలీసులపై కాల్పులు.. చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్

జయభేరి, మొయినాబాద్:

హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ అజీజ్‌నగర్‌లో ఉన్న తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. డ్రగ్స్ టెస్టులో టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ (ఏలూరు)తో పాటు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సహా మొత్తం ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నమిత్, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డిలకు డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలింది. డ్రగ్స్ టెస్టులో టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు నెగటివ్ రాగా, బ్లడ్ టెస్టు చేయగా పాజిటివ్ వచ్చింది. దాంతో డ్రగ్ టెస్టులో మొత్తం ఆరుగురికి పాజిటివ్ వచ్చిందని ప్రకటించారు. ఈగల్ ఫోర్స్ నిర్వహించిన మెరుపు దాడుల్లో నిందితులు తుపాకీతో నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి పోలీసులను భయపెట్టే ప్రయత్నం చేశారని తెలిపారు. ఫాం హౌస్‌లో డ్రగ్స్ పార్టీపై దాడులకు సంబంధించి ఈగల్ ఫోర్స్ ఎస్పీ ఆర్. గిరిధర్ మీడియాకు వివరాలను వెల్లడించారు.

...మిగతాది 2 లో

# అన్నదాతలకు శుభవార్త




- ఆరోజే అకౌంట్లోకి రైతు భరోసా డబ్బులు

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రైతులకు అదిరిపోయే గుడ్‌న్యూస్.. ఈ నెల 22 నుంచి రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతు భరోసా నిధులు విడుదలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో చర్చించారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఈనెల 22న సీఎం రేవంత్ ప్రారంభిస్తున్నారు. అదే రోజున మొదటి విడతగా రైతు భరోసా నగదు బదిలీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి 70 లక్షల మంది రైతులకు రూ.3,590 కోట్లు నిధులను రైతుల ఖాతాల్లోకి ముఖ్యమంత్రి చేతుల మీదుగా బదిలీ చేయనున్నారు. తర్వాత మరో 20 రోజులకు రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు వారి ఖాతాల్లోకి బదిలీ చేయనున్నారు.

మొత్తంగా 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ కానున్నాయి. కాగా, రైతు భరోసా నిధుల విడుదలపై నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు రైతుల తరపున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న ప్రభుత్వమని మరోసారి రుజువైందని తుమ్మల పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# బడ్జెట్ కు వేళాయె

- తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు.. ఈ నెల 20న బడ్జెట్..?

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో బడ్జెట్ సమావేశాలు నేడు (సోమవారం, మార్చి 16) నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉదయం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. దాంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతాయి. మరోవైపు మార్చి 20న రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు వరకు అంటే మార్చి 30 వరకు సమావేశాలు నిర్వహించే

...మిగతాది 2 లో



# మోగిన.. సమరభేరి


- నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు మోగిన నగారా..
- తక్షణమే అమల్లోకి కోడ్..
- ఈ నాలుగు రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోనూ అసెంబ్లీ ఎన్నికలు
- పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ 23, 29, తమిళనాడులో ఏప్రిల్ 23, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలలో ఏప్రిల్ 9
- అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ - కౌంటింగ్ మే 4

జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 15 :

పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళ ఈ నాలుగు రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోనూ అసెంబ్లీ ఎన్నికలకు తేదీలు వెల్లడయ్యాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆదివారం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న ఈ నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో మొత్తంగా 824 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లున్నారు. ఎన్నికల తేదీలను ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రకటించారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరగనుంది. తమిళనాడులో మొత్తం 234 సీట్లకు ఒకే ఫేజ్‌లో ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నారు. పశ్చిమబెంగాల్‌లో 294 సీట్లకు రెండు ఫేజ్‌లలో ఎన్నికలు నిర్వహిస్తారు. మొదటి ఫేజ్‌లో 152 సీట్లకు ఏప్రిల్ 23న రెండో ఫేజ్‌లో 142 సీట్లకు ఏప్రిల్ 29న పోలింగ్ జరుగుతుంది.

...మిగతాది 2 లో

# ఏప్రిల్‌లో రెండో విడత



- ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు పెండింగ్ బిల్లులు క్లియర్
- అకౌంట్లోకి డబ్బులు వచ్చేశాయ్

జయభేరి, హైదరాబాద్ :

ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇళ్లు మంజూరై నిర్మించుకుంటున్న లబ్దిదారులకు తాజాగా నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పెండింగ్ బిల్లులను చెల్లించింది. వీటిని నేరుగా లబ్దిదారుల అకౌంట్లో జమ చేసింది. ఈ దశలో మొత్తం 2,764 మంది లబ్దిదారులకు రూ.28.50 కోట్లు మంజూరు చేసింది. 99 రోజుల కార్యక్రమాన్ని ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం ప్రారంభించిన వారం రోజుల్లో లబ్దిదారులకు నిధులు విడుదల చేసింది. లబ్దిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించినట్లు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌతం ప్రకటించారు. అకౌంట్లలోకి డబ్బులు విడుదల కావడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

**పెండింగ్ బిల్లులు క్లియర్**

పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. వాటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేసేందుకు చర్యలు చేపడుతోంది. దీని వల్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అవుతాయని భావిస్తోంది. సాంకేతిక సమస్యల వల్ల డబ్బులు జమ కాని లబ్దిదారులకు కూడా అందించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతోంది. గత వారం రోజుల్లో ఎల్3 జాబితాలో ఉన్న 1200 మందికి రూ.12.06 కోట్లు విడుదల చేశారు. ఇక బ్యాంక్ వద్ద పెండింగ్‌లో ఉన్న 653 మందికి కూడా రూ.7 కోట్లు విడుదల చేశారు. ఇక అభ్యంతరాల తర్వాత పెండింగ్‌లో పడ్డ 911 మంది లబ్దిదారులకు కూడా రూ.9.40 కోట్లు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది.

**ఏప్రిల్‌లో రెండో విడత**

తొలి విడతలో 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ఇక రెండో విడత జాబితాను త్వరలో ప్రభుత్వం విడుదల చేసింది. ఏప్రిల్‌లో రెండో విడత జాబితా కింద మరికొంత మందిని ఇళ్లను మంజూరు చేయనున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. కాగా ఈ పథకం కింద స్థలం ఉంది ఇల్లు నిర్మించుకోవాలనుకునేవారికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. నాలుగు విడతలుగా లబ్దిదారుల అకౌంట్లలో వీటిని జమ చేస్తోంది. కాగా తొలి విడత జాబితాలో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున మంజూరు చేశారు.



# ఏకంగా పోలీస్ కే ఉచ్చు బిగించిన సైబర్ కేటుగాళ్లు..

జయభేరి, జగిత్యాల జిల్లా :

ఇప్పటిదాకా ఎన్నో సైబర్ నేరాలు చూశాం. సామాన్యులతో పాటు ప్రముఖు మోసం చేసిన ఎన్నో కేసుల గురించి విన్నాం. ఇందుకు సంబంధించి కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి కేటుగాళ్ల తాట తీస్తారు పోలీసులు. అలాంటిది.. సామాన్యులునే కాదు, చివరికి పోలీసు శాఖ అధికారులనూ వదలడం లేదు సైబర్ కేటుగాళ్లు. ఇటీవల ఓ ASIని టార్గెట్ చేసిన

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## మొయినాబాద్ డ్రగ్స్ పార్టీ

11 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు..
"డ్రగ్స్ పార్టీ జరగుతుందని సమాచారం మేరకు మేం రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌పై దాడి చేశాము. లోపలికి ప్రవేశించిన సమయంలో మా అధికారులకు కొన్ని శబ్దాలు వినిపించాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అక్కడికి చేరుకోగా, ఒక వ్యక్తి పిస్టల్ పట్టుకుని కనిపించాడు. మరొకరి వద్ద ఖాళీ తూటాలు ఉన్నాయి. వెంటనే అక్కడ ఉన్న 11 మందిని అదుపులోకి తీసుకున్నాం. వారికి నిర్వహించిన ప్రాథమిక డ్రగ్ టెస్టులో ఐదుగురికి పాజిటివ్ వచ్చింది. ఆసుపత్రిలో నిర్వహించిన రక్త నమూనాల పరీక్షల్లో మరో వ్యక్తి (టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్)కి కూడా పాజిటివ్ రావడంతో, మొత్తం ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయ్యింది" అని ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్ తెలిపారు.
పోలీసులు అదుపులోకి తీసుకున్న 11 మందిలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తొలుత పుట్టా మహేష్ యాదవ్‌కు నెగిటివ్ వచ్చినట్లు ప్రచారం జరిగినప్పటికీ, రక్త నమూనాల నివేదికలో ఆయనకు డ్రగ్స్ పాజిటివ్ అని తేలిందని ఎస్పీ గిరిధర్ స్పష్టం చేశారు.
పోలీసులపై కాల్పులు జరిపారు.. చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్
అనుమతి లేకుండా ఒక ఫామ్‌హౌస్‌లో పార్టీ జరుగుతుందనే సమాచారంతో పోలీసులు శనివారం రాత్రి 9:30 గంటలకు రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌కు వెళ్లి ఆకస్మిక దాడలు నిర్వహించారని చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ తెలిపారు. 'పోలీసులు అక్కడికి చేరుకోగానే, ఢిల్లీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నమిత్ శర్మ గన్‌తో ఒక రౌండ్ కాల్పులు జరిపాడు. రోహిత్ రెడ్డి తమ్ముడు రితేష్ రెడ్డికి చెందిన ఆ తుపాకీకి లైసెన్స్ ఉంది. అయితే, కాల్పులు జరిపింది మాత్రం నమిత్ శర్మ. పార్టీలో 2 గ్రాముల తెల్లటి పొడి (డ్రగ్స్) కూడా పోలీసులకు లభ్యమైంది. అక్కడ ఒక మహిళ సహా మొత్తం 10 మంది ఉన్నారు. వారిలో ప్రజా ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నారు. ఆ 10 మందిలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, టీడీపీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, రితేష్ రెడ్డి, శ్రవణ్ కుమార్, నమిత్ మిశ్రా, ఎం. రమేష్, విజయ్ కృష్ణ, రవి, అర్జున్ రెడ్డి ఉన్నారు. వీరిలో ఐదుగురు రోహిత్ రెడ్డి, నమిత్ మిశ్రా, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డిలకు డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చింది. తదుపరి విచారణ నిమిత్తం వారందరినీ అదనపు శాంపిల్ పరీక్షలకు పంపాం. పూర్తి నివేదికలు వచ్చాక చట్టపరమైన చర్యలు ఉంటాయని' చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్ పేర్కొన్నారు.
కేసులో ముఖ్యాంశాలు..
11 మంది కస్టడీలో ఉండగా, ఆరుగురికి డ్రగ్ పాజిటివ్. పోలీసులను అడ్డుకునేందుకు ఒక వ్యక్తి పిస్టల్‌తో గాలిలోకి కాల్పులు జరిపారు. ఫామ్‌హౌస్ నుండి పిస్టల్, ఖాళీ తూటాలు, డ్రగ్స్ స్వాధీనం. నిందితులను వైద్య పరీక్షల అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించారు. వారిని నేడు కోర్టులో హాజరుపరచనున్నారు.ఈ దాడిలో పట్టుబడిన వారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు చెందిన కీలక రాజకీయ నేతలు కావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేగుతోంది.

## మోగిన.. సమరభేరి

ఎన్నికలు జరుగుతున్న మొత్తం నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో కౌంటింగ్ మే 4న నిర్వహిస్తారు. కాగా పశ్చిమబెంగాల్ మినహా మిగతా అన్ని చోట్లా ఒకే ఫేజ్‌లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్, దశలవారీ పోలింగ్ ప్రణాళికను ఖరారు చేసేందుకు ఈ వారం మొదట్లో మార్చి 11వ తేదీన ఈసీఐ సమావేశమైంది. ఆ నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఆయా అసెంబ్లీల పదవీకాలం ఈ ఏడాది మే, జూన్ నెలల్లో వివిధ తేదీల్లో ముగియనున్నాయి. ఎన్నికల చట్టాల ప్రకారం, ఆ గడువులోగా ఆయా చోట్ల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.
నాలుగు రాష్ట్రాల్లో 2021లో ఎవరు గెలిచారు?
పశ్చిమ బెంగాల్: 294 సీట్లున్న ఈ అసెంబ్లీకి ఇంతకుముందు 2021లో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలలో తృణమూల్ కాంగ్రెస్ 213 సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ నేత మమత బెనర్జీ మూడోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు.
అస్సాం: 126 సీట్లున్న ఈ అసెంబ్లీకి 2021లో జరిగిన ఎన్నికలలో బీజేపీ కూటమి అత్యధికంగా 75 సీట్లు గెలుచుకుని అధికారంలోకి వచ్చింది. బీజేపీ 60 సీట్లు గెలిచింది.
తమిళనాడు: 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీకి 2021లో జరిగిన ఎన్నికల్లో డీఎంకే అత్యధికంగా 133 సీట్లు గెలుచుకుని అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ నేత స్టాలిన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆ ఎన్నికలలో డీఎంకే, కాంగ్రెస్, మరికొన్ని పార్టీలు కలిపి పోటీ చేశాయి. ఆ కూటమికి మొత్తంగా 159 సీట్లు వచ్చాయి. అన్నాడీఎంకే, బీజేపీల కూటమికి 75 సీట్లు వచ్చాయి.
కేరళ: 140 సీట్లున్న ఈ అసెంబ్లీకి 2021లో జరిగిన ఎన్నికల్లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) 99 స్థానాలు గెలిచి వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చింది. పినరయి విజయన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

## బడ్జెట్ కు వేళాయె

అవకాశం ఉంది. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మార్చి 16 సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 16 న గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతాయి. అలాగే మార్చి 20 న తెలంగాణ రాష్ట్ర ఆర్థిక బడ్జెట్ ను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి శాసన సభలో ప్రవేశపెట్టనున్నారు. ఇక మార్చి 20 నుంచి 30వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు జరపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇక తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆహ్వానం పలికారు. ఇక అసెంబ్లీ సమావేశాల్లో పలు కీలక అంశాలను చర్చించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధం అవుతన్నట్లు తెలుస్తోంది. వాటిలో ప్రధానంగా.. గిగ్ వర్కర్లు హక్కుల పరిరక్షణ కోసం కొత్త చట్టానికి మద్దతుపై చర్చించే అవకాశం ఉంది. అలాగే రాష్ట్రంలోని విద్యారంగంపై చర్చించనున్నట్లు సమాచారం. విద్యారంగంలో కొత్త విధానాల అమలు, మార్పులు, బడ్జెట్ కేటాయింపులపై చర్చ జరగనుంది. ఇక మూసీ నది ప్రక్షాళనపై చర్చ, కాళేశ్వరం ప్రాజెక్టు తదితర కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఏకంగా పోలీస్ కే ఉచ్చు

మాయాగాళ్లు ఉచ్చు బిగించారు. బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి, అతని నుంచి రూ.95,500 తమ బ్యాంకు ఖాతాలో మళ్లించుకున్నారు. జగిత్యాల జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. జగిత్యాల జిల్లాలోని ఓ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్సైకి ఇటీవల ఓ వీడియో కాల్ వచ్చింది. తాను మాట్లాడిన వీడియోను రికార్డు చేసిన సైబర్ నేరగాళ్లు.. కొద్దిసేపటికే మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని ఏఎస్సైను బెదిరించారు. దీంతో భయపడిన సదరు ఏఎస్సై మూడు విడుతలుగా రూ.95,500 సైబర్ నేరగాళ్ల ఖాతాలో జమచేశాడు. చివరికి మోసపోయానని తెలుసుకుని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. చివరికి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన నాలుగు రోజుల క్రితం చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఇలాంటి కేసులు పెరుగుతున్నాయి. చాలా మంది ఇదే విధంగా మోసపోతున్నారు. వివిధ ఫోన్ నంబర్స్ కాల్ చేసి బెదిరిస్తున్నారు. ఎవరైనా పరిచయం లేని వ్యక్తులు, వివరాలు అడుగుతే ఇవ్వకూడదని పోలీసులు సూచిస్తున్నారు. సైబర్ కేటుగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు.

# ఇజ్రాయెల్ ప్రధాని బతికే ఉన్నారా.?



ఇరాన్ యుద్ధానికి సంబంధించి సోషల్ మీడియాలో ఎన్నో వార్తలు వస్తున్నాయి. వీటిలో కొన్ని పుకార్లు కూడా వస్తున్నాయి. ఇరాన్ చేసిన దాడిలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరణించారంటూ వార్తలు వస్తుండగా.. దీనిపై ఇజ్రాయెల్ స్పందించింది. నెతన్యాహు తన అధికారిక X ఖాతాలో ఒక వీడియోను పోస్టు చేశారు. ఆ వీడియోలో ఆయన ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధ పరిస్థితులపై మాట్లాడారు. అయితే ఆ వీడియోను గమనించిన కొంతమంది నెటిజన్లు ఒక విచిత్ర అంశాన్ని గుర్తించారు. వీడియోలో ఆయన చేతికి ఆరు వేళ్లు కనిపిస్తున్నట్లు అనిపించడంతో అది ఏఐ టెక్నాలజీతో తయారైన వీడియో కావచ్చని అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో వీడియో నిజమా కాదా అన్న సందేహాలు మొదలయ్యాయి.

**నెట్టింట ఊహాగానాలు**

వీడియోపై వచ్చిన అనుమానాలు క్రమంగా పెద్ద చర్చకు దారి తీశాయి. కొంతమంది సోషల్ మీడియా వినియోగదారులు నెతన్యాహు గురించి అనేక ప్రశ్నలు లేవనెత్తారు. "ఆయన ఎక్కడున్నారు?", "ఆ వీడియో ఎందుకు తొలగించారు?", "అసలు ఆయన క్షేమంగా ఉన్నారా?" వంటి ప్రశ్నలు సోషల్ మీడియాలో వరుసగా కనిపించాయి. కొందరు మరింత ముందుకు వెళ్లి ఇరాన్ దాడుల్లో ఆయన మరణించి ఉండొచ్చని కూడా ప్రచారం చేయడం ప్రారంభించారు.

**ఆమె ప్రశ్నలతో పెరిగిన అనుమానాలు**

ఈ అంశంపై అమెరికాకు చెందిన పొలిటికల్ కమ్యూటేటర్ కాండేస్ ఓవెన్స్ కూడా స్పందించారు. ఆమె సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు లేవనెత్తారు. నెతన్యాహు ఎక్కడ ఉన్నారు? ఆయన కార్యాలయం ఎందుకు ఆ వీడియోను విడుదల చేసింది? తరువాత ఎందుకు తొలగించింది? వంటి సందేహాలను ఆమె వ్యక్తం చేశారు. దీంతో ఈ వార్త మరింతగా వైరల్ అయింది.

**ఇజ్రాయెల్ కార్యాలయం ఇచ్చిన స్పష్టత**

ఈ పరిస్థితుల్లో నెతన్యాహు కార్యాలయం అధికారికంగా స్పందించింది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అసత్యమని స్పష్టం చేసింది. ప్రధాని సురక్షితంగా ఉన్నారని, ఆయన ఆరోగ్యంగా ఉన్నారని తెలిపింది. దీంతో సోషల్ మీడియాలో వచ్చిన ఊహాగానాలకు కొంతవరకు తెరపడింది.

**హెచ్చరిస్తున్న ఇరాన్**

ఇదిలా ఉంటే.. ఇరాన్‌కు చెందిన సైనిక విభాగం ఇస్లామిక్ రివల్యుష్నరీ గార్డ్ కార్ప్స్ నెతన్యాహుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇజ్రాయెల్ ప్రధాని చర్యలను తీవ్రంగా విమర్శిస్తూ, ఆయనపై కఠిన హెచ్చరికలు జారీ చేసింది. ఆయన ఇంకా జీవించి ఉంటే ఎక్కడ ఉన్నా వెంబడిస్తామని పేర్కొంది. అయితే నెతన్యాహు నిజంగా ఎక్కడ ఉన్నారన్న విషయంపై ఇరాన్ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తూ వ్యాఖ్యలు చేయడం కూడా చర్చకు దారి తీసింది. కాగా, ఇజ్రాయెల్ మాత్రం ఈ వార్తలన్నీ ఫేక్ అని స్పష్టంగా చెబుతోంది.



## కెరీర్ పీక్‌లో ఉండగానే వ్యభిచారం కేసు..

■ పెళ్లైన 9నెలలకే విడాకులు..

సినిమా ఇండస్ట్రీలో కొంతమంది తారలు అలా వచ్చి.. ఇలా వెళ్ళిపోతూ ఉంటారు. చేసింది తక్కువ సినిమాలే అయిన గుర్తుండిపోయే సినిమాలు చేసి ఆకట్టుకుంటారు.. ఆ తర్వాత చాలా కాలం కనిపించకుండా సడన్ గా ఏదో ఫంక్షన్ లోనో లేక సోషల్ మీడియాలోనో దర్శనమిస్తూ ఉంటారు. అప్పటికి ఇప్పటికి గుర్తుపట్టలేనంతగా మారిపోతారు ఆ భామలు. అలా వచ్చిన వారిలో ఈ అమ్మడుకు కూడా ఒకరు. చిన్న వయసులోనే కెరీర్ లో పీక్ చూసింది. కానీ ఓ హోటల్ లో పోలీసులకు చిక్కి అనుకోని వివాదల్లో చిక్కుకుంది. తెలుగు, హిందీ భాషలలో పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. కానీ అనుకోని విధంగా వివాదాలతో ఆమె కెరీర్ పడిపోయింది. 17 ఏళ్ల వయసులో ఇండస్ట్రీలో స్టార్ డమ్ తెచ్చుకుంది. కానీ 23 ఏళ్లకే ఆమె కెరీర్ ఊహించని మలుపు తిరిగింది. ఆ నటి మరెవరో కాదు.. శ్వేతా బసు ప్రసాద్. 2002లో బాలీవుడ్ చిత్రం మక్డీలో బాలనటిగా రంగప్రవేశం చేసింది. ఆ తర్వాత కహానీ ఘర్ ఘర్ కీ అనే టీవీ సీరియల్‌తో ప్రేక్షకులకు దగ్గరయ్యింది. ఇక ఆ తర్వాత తెలుగులో కొత్త బంగారు లోకం సినిమాతో హీరోయిన్ గా మారింది. ఈ సినిమా అప్పట్లో సూపర్ హిట్ అయ్యింది. అంతేకాకుండా ఈ మూవీలో తనదైన నటనతో అప్పట్లో కుర్రకారును ఉర్రూతలూగించింది. తొలి సినిమాతోనే కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్ అయ్యింది. ఆతర్వాత ఒకటి రెండు సినిమాలు చేసింది. స్టార్ హీరోయిన్ అవుతుందని అంతా అనుకునేలాగా వ్యభిచారం కేసులో చిక్కుకుంది. దాని నుంచి బయటకు వచ్చింది. తన తప్పులేకున్నా తనకు ఆ కేసులో ఇరికించారని తెలిపింది. ఆ తర్వాత పెళ్లి చేసుకున్నప్పటికీ ఆ బంధం నిలబడలేదు. 2018లో ఓ వ్యక్తిని రహస్యంగా పెళ్లి చేసుకుంది శ్వేత. కానీ వీరి బంధం 9 నెలలకే ముగిసింది. 23 వయసులోనే పెళ్లి.. ఆ తర్వాత విడాకులు తీసుకున్న శ్వేత.. కొన్నాళ్లపాటు సినిమాలకు దూరంగా ఉండిపోయింది. ఇప్పుడిప్పుడే రీఎంట్రీ ఇస్తుంది. అటు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ అయ్యింది. ప్రస్తుతం బాలీవుడ్ లో సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తుంది ఈ చిన్నది.

## ఇక వర్షాలే వర్షాలు..

### చల్లటి కబురు చెప్పిన వాతావరణ శాఖ..



మార్చి నెలలోనే ఎండ తీవ్రతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వాతావరణశాఖ చల్లటి కబురు చెప్పింది. పశ్చిమ హిమాలయాలను సమీపిస్తున్న పశ్చిమ అల్పపీడనం కారణంగా ఉత్తరాది రాష్ట్రాల్లో తుఫాను పరిస్థితులు ఏర్పడ్డాయి. ఢిల్లీ, హర్యానా, యుపి, రాజస్థాన్, హిమాచల్, పంజాబ్‌లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. ఈ సీజన్ లో ఇవి ప్రీమాన్‌సూన్ వర్షాలు.. వీటి వల్ల గరిష్ట ,కనిష్ట ఉష్ణోగ్రతల్లో సగటున 5 డిగ్రీల వరకు మార్పు వచ్చిందని.. సోమవారం కనిష్ట ఉష్ణోగ్రత 1416 డిగ్రీల సెల్సియస్‌గా_ _ _ గరిష్ట ఉష్ణోగ్రత 3133 డిగ్రీల సెల్సియస్‌గా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.
గత బుధవారం అత్యధికంగా ఢిల్లీలో 36.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత, 20.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. వర్షాల ప్రభావంతో రానున్న వారం రోజులపాటు ఉష్ణోగ్రతలు తగ్గనున్నాయి. పశ్చిమ హిమాలయాలు, దాని పరిసర మైదానాలలో రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, వడగళ్ల తుఫాను సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం పశ్చిమ అల్పపీడనం కారణంగా ఢిల్లీ ఎన్సీఆర్ లో కురుస్తున్న వర్షం కురుస్తుంది. ఢిల్లీకి ఆరెంజ్ అలెర్ట్, నోయిడా, గురుగ్రామ్‌లకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. దీంతో అధిక ఉష్ణోగ్రతల నుండి ఢిల్లీ వాసులకు ఉపశమనం లభించినట్లైంది. ఢిల్లీతో పాటు పంజాబ్, హర్యానా లోని కొన్ని ప్రాంతాల్లో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.హిమాచల్ ప్రదేశ్‌లోని కులు, మండి, సిమ్లా జిల్లాల్లో మార్చి 18 వరకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది వాతావరణ శాఖ..

**తెలుగు రాష్ట్రాల్లో సైతం వర్షా లు..**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సైతం వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం, సోమవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. ఈదురు గాలులు గంటకు 3040 కిలోమీటర్లు గరిష్టముగా 50 కిలోమీటర్లు వేగముతో వీస్తాయని పేర్కొంది.

# భక్తజనంతో పోటెత్తిన యాదగిరిగుట్ట

■ శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.52,06లక్షలు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 15 :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట కిటకిటలాడింది. శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి కొండపైన,కొండ కింద పలు ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది. స్వామి వారి దర్శన క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయం, టికెట్ల విక్రయ కేంద్రాలు, పార్కింగ్, బస్టాండ్, పుష్కరిణి, తలనీలాలు సమర్పించే కేంద్రం, శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు సందడి చేశారు.

అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 5 గంటలకు, సర్వ దర్శనానికి 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**శ్రీ లక్ష్మి నారసింహుడికి పుష్పార్చన..**

శ్రీలక్ష్మి నరసింహస్వామి వారికి ఘనంగా పుష్పార్చన జరిగింది. ఏకాదశిని పురస్కరించుకొని శ్రీలక్ష్మి నరసింహస్వామి వారిని పుష్పార్చనను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**కొనసాగుతున్న నిత్యపూజలు..**

శ్రీలక్ష్మి నరసింహస్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్య నారాయణ స్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేతరామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మి నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**యాదగిరీశుడి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నర సింహస్వామి వారికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్య రాబడిలో భాగంగా స్వామి,అమ్మవార్లకు రూ.52,06,106 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,09,150,బ్రేక్‌దర్శనం ద్వారా రూ.3,91,500, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.3,21,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.7,50,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,44,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,04,400, ప్రసాద విక్రయం ద్వారా రూ.18,34,490, కల్యాణకట్ట ద్వారా రూ.1,60,000తోపాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.





# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 15 :** తుర్కపల్లి మండలం గంధమల్ల,కొండాపురం, వాసాలమర్రి, పల్లెపహాడ్, రుస్తాపూర్, మంచిరోనిమామిళ్ల గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశాల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పట్టు వస్త్రాలను, యాట పొట్టేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలో ఆలేరు నియోజకవర్గంలో మొదటి విడత 3500 ఇండ్లను మంజూరు చేసినట్లు 90% పూర్తయినయని తెలిపారు. అందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఉండకూడదని ప్రత్యేక దృష్టితో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకురావడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచులు బొత్త రాములు, శివరాత్రి లావణ్య జహంగీర్, దొమ్మాట అనురాధ బాబు, పాంగల పవనీత బాలకృష్ణ ,భూక్య రాజారాం నాయక్, నాయకులు ఎలగల రాజయ్య, ధనావత్ భాస్కర్ నాయక్, బోరెడ్డి మహిపాల్ రెడ్డి, జింకల ఎల్లేష్ యాదవ్, శ్రీరామ్ మూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

■ ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో భారీ ఊరేగింపు

■ చౌలపల్లి ప్రతాప్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ అందెమోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమం

■ ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, మార్చి 15 :** శంకరన్నకు జేజేలు అని నినాదాలతో షాద్ నగర్ పట్టణములో నేతలు కార్యకర్తల ఉత్సాహంతో ఎమ్మెల్యే శంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.జననేతగా తమ ఘన నేతగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను భావించే నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి పట్టణ కూడలిలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. అనంతరం భారీ ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే వాహనం మీద నుండి తనని అభిమానించే ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ.. మంచి కోసం మార్పు కోసం ప్రజా సంక్షేమం కోసం తను ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. నేతలు, కార్యకర్తలే తన బలమని ప్రజల దీవెనలు ఉన్నంతకాలం అందరికీ అండగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, రఘు, చెంది తిరుపతిరెడ్డి, మాధవులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నూకాలమ్మ తల్లి పండగ గోడపత్రిక ఆవిష్కరణ



**జయభేరి, పరవాడ:** పరవాడ మండలం వెన్నెల పాలెం గ్రామంలో కొలువతీరిన నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని ఈనెల 18న బుధవారం కొత్త అమావాస్య పర్వదినాన ఘనంగా నిర్వహించనున్నారు. జాతరలో భాగంగా నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాలకు సంబంధించి ముద్రించిన గోడ పత్రికను ఆదివారం నూకాలమ్మ తల్లి ఆలయం వద్ద స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ పెద్దలు ఆవిష్కరించారు. బుధవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభం అవుతాయని, మధ్యాహ్నం 12 గంటల నుండి దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసామరాధన నిర్వహించబడుతుందని తెలిపారు. జాతరలో భాగంగా సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెన్నెల ఏకుల అప్పారావు,వాసిరెడ్డి ఈశ్వర్రావు,పైల ప్రసాద్, భోజంకి అప్పలనాయుడు,వెన్నెల వెంకట గిరి, గొంప మారునాయుడు,లోకిరెడ్డి సన్యాసినాయుడు (అభి), బండారు సోమునాయుడు,వెన్నెల నరసింహారావు,ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు,పైల రమణాజీ,బండారు సతీష్,బండారు నర్సింగరావు,మాసవరపు నాయుడు(ఎస్టీపిసి ),వాసిరెడ్డి ఎర్రినాయుడు,తదితర నాయకులు ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

■ జిల్లా ఎస్పీ

**జయభేరి, అనకాపల్లి:** ఎస్.ఎస్.సీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రకటించారు.జిల్లాలో మొత్తం పరీక్షా కేంద్రాలు 102 మొత్తం విద్యార్థులు: 21,017 (బాలురు: 10,673, బాలికలు: 10,344) పరీక్షల్లో వాస్తున్నారని పరీక్షా సమయం: ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు ఉటుందని విద్యార్థులు అందరూ ఉదయం 9:00 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి తెలిపారు.పరీక్ష పూర్తయ్యే వరకు విద్యార్థులను బయటకు పంపడం జరగదని తెలియజేసారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని .పరీక్షా సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ మరియు ఇంటర్నెట్ షాపులను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసాం అని తెలియజేసారు.

# మూసీ పునరుజ్జీవంతో భాగ్యనగరం ముస్తాబు!

■ జీకే ఆర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్



**జయభేరి, దేవరకద్ర :** మూసి పునరుజీవంతో భాగ్యనగరం ముస్తాబు అవుతుందని జికే ఆర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోన రాజశేఖర్ అన్నారు.ప్రజారోగ్యం, మెరుగైన భవిష్యత్తు కోసం నది ప్రక్షాళన అనివార్యం. పేదలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిది అని ఆయన అన్నారు. పర్యాటకం, నైట్ ఎకానమీ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు దీనివల్ల లభిస్తాయన్నారు. కాలుష్య రహిత మూసీ, భావి తరాల భవిష్యత్తుకు బంగారు వారధి అని కోన రాజశేఖర్ అన్నారు.



# రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 15 :** తుర్కపల్లి మండల కేంద్రంలో రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు రంజాన్ తోపాకిట్లను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసము శాంతి, సౌభ్రాతత్వము, సేవా భావానికి ప్రతీక అని అన్నారు. పేద కుటుంబాలకు ఉపవాస దినాల్లో ఉపయోగపడే విధంగా ప్రభుత్వము, నాయకులు ఇలాంటి సహాయ సహకారాలు చేపట్టడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రతి వర్గం ప్రజలు సంతోషంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు ఉపవాసాలు విజయవంతంగా పూర్తి చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచులు సోముల వెంకటేశం భూక్య రాజారాం నాయక్, నాయకులు ఏలగల రాజయ్య, బొరెడ్డి హనుమంత రెడ్డి, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 15 :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో అవసరమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రుద్ర హాస్పిటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్నచిన్న వ్యాధులకే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు తుర్కపల్లిలో ఆధునిక వైద్య సదుపాయాలతో హాస్పిటల్ ఏర్పాటు కావడం ఆనందదాయకమని అన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి పలు చర్యలు చేపడుతుందని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు సానిటేషన్ కిట్టు అందజేత



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 15 :** తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికల్లో భాగంగా ఆదివారం గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సానిటేషన్ కిట్లను అందజేశారు. అనంతరం హెల్త్ చెకప్ చేయించి పారిశుద్ధ్య కార్మికులకు పాదాభివందనం చేసి సబ్బులను కొబ్బరి నూనె డబ్బాను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దానబోయిన నవీన్, నాయకుడు దానబోయిన పోచయ్య, ఏఎన్ఎం భాగ్య, వివోఏ ఉమారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ స్వాతి, కరోబార్ స్వామి గౌడ్ పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం



**జయభేరి, దేవరకొండ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా OBC ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్వార్టర్లీ మీటింగ్లో తెలంగాణ సర్కిల్ CGM తో, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో, ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కరపత్రం రిలీజ్ కార్యక్రమంలో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా OBC ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్వార్టర్లీ మీటింగ్ సికింద్రాబాద్ AO, నిజామాబాద్ AO క్వాటర్లి మీటింగ్ లో, పలు కార్యక్రమాలలో పాల్గొన్న SBI OBC వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, SBISUHC నల్గొండ AO ఆర్గనైజింగ్ సెక్రటరీ, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు NVT.

# కోన రాజశేఖర్ సేవా భావం అభినందనీయం

- ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశానుసారం పుస్తె మెట్టెలు అందజేసిన చైర్మన్ కోన రాజశేఖర్
- గత కొన్ని ఏళ్లుగా సేవా కార్యక్రమాలు
- నిరుపేద కుటుంబాల శుభకార్యాలకు అండగా నిలుస్తున్న జీకేఆర్ ఫౌండేషన్
- ఇప్పటికే అనేక వివాహాలకు సహాయం చేసిన ఫౌండేషన్



జయభేరి, దేవరకద్ర :

ఆయన ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి.. కానీ ఎవరైనా వివాహాలు జరిపించే విషయంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తితే వెంటనే సమస్యను ఆ వ్యక్తికి తెలుపుతారు. ఆ వ్యక్తి తనవంతు సహకారంగా ఆ నూతన దంపతులకు పుస్తెమెట్టలను అందజేస్తారు. ఇలా గత కొన్నేళ్లుగా ఒకటి కాదు, రెండు కాదు, ఎన్నో వివాహాలకు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశానుసారం పుస్తెమెట్టలను అందజేసి ప్రశంసలు అందుకుంటున్నారు. ఆయన పేరే కోన రాజశేఖర్. కోన రాజశేఖర్ మరోసారి నిరుపేద నూతన దంపతులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశానుసారం ఆదివారం పుస్తె మెట్టలను అందజేసి శభాష్ అనిపించుకున్నారు. సమాజ సేవలో ముందుండే నాయకుడిగా పేరుగాంచిన జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం అడవి అజిలాపూర్ గ్రామానికి చెందిన ఎరుకలి హనుమంతు - అనంతమ్మ దంపతుల కుమారుడు రాఘవేందర్, భారతి వివాహ వేడుకకు అవసరమైన పుస్తె మెట్టెలను అందజేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు రాజశేఖర్. వివాహ వేడుకకు అవసరమైన పుస్తె మెట్టెల కోసం కుటుంబ సభ్యులు జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్‌ను సంప్రదించారు. దీంతో కోన రాజశేఖర్ వెంటనే స్పందించారు. ఎమ్మెల్యే జిసమధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ఆదేశానుసారం ఎలాంటి ఆలస్యం చేయకుండా పుస్తె మెట్టెలను అందజేసి ఆ కుటుంబానికి సహకారం అందించారు. పెళ్లి వంటి శుభకార్యాల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సహాయం చేయడం సమాజంలో ఎంతో గొప్ప విషయం అని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో ముందుకు వచ్చి సహాయం చేయడం ద్వారా పేద కుటుంబాలకు ఎంతో ధైర్యం, ఆత్మవిశ్వాసం కలుగుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, కోన రాజశేఖర్ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకొని స్పందిస్తూ సహాయం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. జీకేఆర్ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో మంచి పేరు సంపాదించారని తెలిపారు. ఇప్పటికే కోన రాజశేఖర్ గతంలో కూడా అనేక నిరుపేద కుటుంబాల వివాహాలకు పుస్తె మెట్టెలు అందజేసి సహాయం చేసిన విషయం స్థానికులు గుర్తు చేశారు. పేద కుటుంబాల పెళ్లిళ్లు సజావుగా జరగాలని భావించి అనేక సందర్భాల్లో ముందుకు వచ్చి సహాయం చేయడం ఆయన సేవా మనసుకు నిదర్శనమని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే జీఎంఆర్ మార్గదర్శకత్వంలో సమాజ సేవను ప్రధానంగా తీసుకొని కోన రాజశేఖర్ ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగించడం ప్రశంసనీయం అని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంచి పేద ప్రజలకు మద్దతు అందిస్తాయని వారు తెలిపారు. పెళ్లి శుభకార్యానికి పుస్తె మెట్టెలు అందజేసినందుకు రాఘవేందర్ భారతి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు కోన రాజశేఖర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసి అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరుకున్నారు. జీకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే విద్య, వైద్యం, వివాహ సహాయం, పేద ప్రజలకు అవసరమైన అనేక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని స్థానికులు తెలిపారు. సమాజ సేవలో ముందుండే నాయకుల వల్ల గ్రామాల్లో అభివృద్ధి, పరస్పర సహకారం పెరుగుతుందని వారు పేర్కొన్నారు.



## జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకు కృషి భువనగిరి ఎంపీ చామల కిరణ్

జయభేరి, హైదరాబాద్, మార్చ్15 :

యాదాద్రి భువనగిరి జిల్లాలోని పనిచేస్తున్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా ఆదివారం ఆయనను కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పలు సమస్యలను ఖచ్చితంగా పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు. ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని అని అడిగిన విషయాన్ని కూడా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ప్రజాపాలన ప్రభుత్వం మీకు పూర్తిగా అండగా ఉంటుందని అన్నారు.

## ఘనంగా మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



జయభేరి, శామీర్ పేట్, మర్చి 15:

అలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజీబుద్ధిన్, జిల్లా ఆర్టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, లు హాజరై కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణారెడ్డి అందరిని కలుపుకుని పోయే మనస్తత్వం కలవాడని, ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకుని ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జిడిపల్లి వేణుగోపాల్ రెడ్డి , అలియబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్,పలువురు కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ కిట్, నగదును అందజేసిన హైకోర్టు అడ్వకేట్ మందడి సరోజ్ రెడ్డి



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మండలం పాలెంలో వివేకానంద క్రికెట్ క్లబ్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ కి ప్రముఖ హైకోర్టు న్యాయవాది, నియోజకవర్గ బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేకానంద క్రికెట్ క్లబ్ సభ్యులకు క్రికెట్ కిట్ తో పాటు రూ. 10 వేల నగదును ఆయన అందజేశారు.ఈ సందర్భంగా సరోజ్ రెడ్డి మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడా రంగంలో ముందుండాలని, ఏ సమస్య ఏదైనా దానిని పరిష్కరించడానికి ముందు ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, సరోజ్ మిత్రమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సోదరుడితో కలిసి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మూసాపేట్ మండలం జానంపేట లో ఆదివారం బండ కృష్ణారెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు జగదీశ్వర్ రెడ్డి తో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన వారికి ఇంటి యజమానులు ఘనంగా స్వాగతం పలికే సన్మానించారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే రంజాన్ పండుగ శుభాకాంక్షలు

జయభేరి, దేవరకద్ర :

ముస్లిం సోదరులకు ముందస్తుగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే జిఎంఆర్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను ఆనందోత్సాహాల మధ్య భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ కొరారు. నెల రోజులపాటు కఠోర నియమాలతో కూడిన ఉపవాస దీక్షలున్నఉన్న ముస్లిం సోదరులకు ఆయన అభినందించారు. పవిత్రతకు మారుపేరుగా రంజాన్ పండుగ నిలిచిందని ఎమ్మెల్యే జిఎంఆర్ కొనియాడారు. ఇంతటి విశిష్టత గల రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

## దేవరకద్ర నియోజకవర్గంలో బిజెపి నిరసనలు

- దేవరకద్ర బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి వెల్లడి



జయభేరి, దేవరకద్ర :

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధిష్టానం పిలుపుమేరకు ఈనెల 16,17 తేదీలలో మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు దేవరకద్ర నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని ఆరు గ్యారంటీలు,420 హామీల గురించి ప్రజలకు తెలియజేసి మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమం చేపట్టి మండల తహసిల్దార్ కార్యాలయాలలో వినతి పత్రాలు ఈ నిరసన కార్యక్రమాలలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు, భూత్ అధ్యక్షులు, వివిధ అధ్యక్షులు, గ్రామ మండల జిల్లా పదాధికారులు కార్యకర్తలందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కొండ ప్రశాంత్ రెడ్డి కోరారు.

## పరవాడలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పురస్కార ప్రదానోత్సవం

- ముఖ్య అతిథిగా పరవాడ మండల ఎంపీపీ పయిల వెంకట పద్మా లక్ష్మి



జయభేరి, పరవాడ:

3వ మోడ్రన్ షిటో రయి కరాటే డూ అసోసియేషన్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష మరియు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం, 2026 మార్చి 15న పరవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విజయవంతంగా నిర్వహించబడింది. రయి కరాటే డూ అసోసియేషన్ అధికారుల మార్గదర్శకత్వంలో మహారాజ్ ఛాంపియన్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష మరియు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మొత్తం 26 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరందరూ తమ కరాటే శిక్షణలో అంకితభావం మరియు క్రమశిక్షణను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పరవాడ. ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి,సీఐ మల్లికార్జున్ రావు ,సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పిబోనంగి రాయవరపు దేముడు పాల్గొని యువతలో కరాటే, క్రమశిక్షణను ప్రోత్సహించడానికి మహారాజ్ ఛాంపియన్స్ కరాటే అకాడమీ చేస్తున్న కృషిని ప్రముఖులు ప్రశంసించారు. ఆత్మవిశ్వాసం, ఫిట్‌నెస్, వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి మార్షల్ ఆర్ట్స్ సాధన కొనసాగించాలని వారు విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో 3వ వార్డ్ మెంబెర్ పైల హరీష్,వైస్సార్సీపీ యూత్ లీడర్ పైలా సాయి అప్పల నాయుడు ,మండల ఎస్.సి సెల్ ప్రెసిడెంట్ ములకపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా దుస్తుల కిట్ల పంపిణీ

రంజాన్ పండగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలి: జైపాల్ రెడ్డి



జయభేరి, శామీర్ పేట్, మర్చి 15:

రంజాన్ మాసం ముస్లీం సోదరులకు పవిత్రమైనదని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మహ్మద్ ముజిబుద్దీన్ లు అన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకుని శామీర్ పేటలోని స్థానిక మసీదు వద్ద ముస్లీం సోదర సోదరీమణులకు ప్రభుత్వం తరపున రంజాన్ తోఫా దుస్తుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ఈ మాసంలో వారు నియమనిష్టలతో ఉపవాస దీక్షలు చేయడం సంతోషకరమన్నారు. రంజాన్ పండగ సంతోషంగా జరుపుకునేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ రోజు వారికి రంజాన్ తోఫా కిట్లను అందచేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మహ్మద్ షఫియోద్దీన్, మండల మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు యాష్కీ శంకర్ గౌడ్, విలాసాగరం అశోక్, మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ డప్పు సాయిబాబా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మేకల ఆ0జనేయులు, సొగడి బాల్ రాజు, నాయకులు వంగ నర్సింహ రెడ్డి, సాయిపేట శ్రీనివాస్ యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, మాజీ వార్డు సభ్యులు ఇర్ఫాన్, అఫ్జల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన ప్రారంభోత్సవానికి హాజరైన జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండలం గుండ్ల పొట్లపల్లిలో ఆదివారం జరిగిన నూతన ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన ప్రారంభోత్సవానికి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ హాజరు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖరు ముదిరాజ్ కమ్యూనిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ లో పలు ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన పనులకు నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకి కృషి చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి BRS నాయకులు, స్థానిక ప్రజలు పాలభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్ రెడ్డి నగర్ పరిధిలో డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్లు, బాక్స్ డ్రెయిన్‌లు, కమ్యూనిటీ సదుపాయాలు, సమాధి స్థల అభివృద్ధి వంటి మొత్తం రూ. 8.36 కోట్ల విలువైన 15 అభివృద్ధి పనులు మంజూరు చేయబడ్డాయి. ఈ పనులు పూర్తయితే కాలనీల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు మరింత సౌకర్యం కలుగనుంది.

ఈ అభివృద్ధి కార్యక్రమాలకి కృషి చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు డా. B.V. చారి ఆధ్వర్యములో సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రాజు, మేకల శ్రీనివాస్, సాగర్, మహేందర్, మద్దూరి శ్రీనివాస్, గణేష్, దినేష్, సంతోష్, బాలకృష్ణ, మధు, అబ్బు, కైసర్, సుధాకర్ రెడ్డి, పాండు రంగారెడ్డి, గోపాల్



యాదవ్, నవీన్, సోమేష్, శంకర్, సిద్ధిరాజు, రాధ కృష్ణ, అనిల్, మహిళ నాయకురాళ్ళు రాధమ్మ, యాదమ్మ, రాజ్యలక్ష్మి, రేఖ, ఐశ్వర్య, జరీనా, స్వప్న రెడ్డి, మంజుల, పాల్గొని వెంకట్ రెడ్డి నగర్ బస్ స్టాప్ ప్రాంగణంలో స్వీట్ పంచుతూ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆ ప్రాంత ప్రజలు ప్రత్యేకంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యా సంస్థలు

- 10 క్లాస్ పర్మిషన్ లేకుండానే అడ్మిషన్ చేసుకున్న శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోవాలి. స్కూల్ ని రద్దు చేయాలి.
- విచ్చలవిడిగా పర్మిషన్ ఇచ్చిన ఎంఈఓ పై చర్యలు తీసుకోవాలి.
- పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్

జయభేరి, రంగారెడ్డి జిల్లా :




శంకర్ పల్లి మండల కేంద్రంలోని ప్రైవేటు విద్యా సంస్థలు అయినా శ్రీ చైతన్య టెక్నో పాఠశాల, మాస్టర్ మైండ్ స్కూల్, రావుస్ స్కూల్, ఎస్ ఎస్ ఎక్సలెంట్ స్కూల్, ఎందులో కూడా ఫైర్ సేఫ్టీ లేదు, సరైన వెంటిలేషన్ లేదు, పర్మిట్ లేని బస్సులను నడుపుతున్నారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ అన్నారు. అదే విధంగా శ్రీ చైతన్య పాఠశాల హై టెన్షన్ వైర్ల కింద ఉండడంతో దాదాపు 12 సంవత్సరాల తర్వాత పిల్లలకి రేడియేషన్ ప్రభావం పడే అవకాశం ఉంది. దీనివలన విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుంది ఇవన్నీ ఒక ఎత్తు అయితే 10 వ తరగతి పర్మిషన్ లేదు. అయినా అడ్మిషన్స్ తీసుకొని ఇన్ని రోజులు క్లాసులు చెప్పి పరీక్షలు మాత్రం చేవెళ్ల మండల కేంద్రంలోని సెంటర్స్ లలో రాయిస్తున్నారు. ఇలా విద్యార్థులు శంకరిపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి చేవెళ్లకి సమయానికి చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కోరా హడావిడిలో వచ్చేముందు విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరూ బాధ్యత ఇదంతా శంకర్ పల్లి ఎంఈఓ కి, రంగారెడ్డి జిల్లా విద్యాధికారి కి తెలియకుండానే జరుగుతుందా విద్యార్థి సంఘం నాయకులు బయట పెట్టేంత వరకు తెలుసుకోలేకపోయారు అంటే వారి విద్య పర్యవేక్షణ ఎంత నిర్లక్ష్యంగా ఉందో తేటతెలమైంది. వీరి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ పాఠశాలలో కాకుండా విద్యార్థులు ఇలాంటి పర్మిషన్ లేని పాఠశాలలో అడ్మిషన్ తీసుకొని నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి అధికారుల వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడే స్థాయికి వస్తున్నాయి. కాబట్టి దీని అంతటికి కారణమైన ఎంఈఓ పై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా నిలిపి వేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) గా డిమాండ్ చేస్తున్నాం. ఎలాంటి చర్యలు తీసుకోకపోతే పిడిఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి బొజ్జి శ్రీకాంత్ అన్నారు.

# మైనార్టీ కుటుంబాలకు రేషన్ కిట్ల పంపిణీ

- ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా కిట్ల పంపిణీ

జయభేరి, దేవరకద్ర :




రంజాన్ పండుగను పురస్కరించుకొని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర పట్టణంలో మైనార్టీ కుటుంబాలకు ఆదివారం రాత్రి రేషన్ కిట్లను పంపిణీ చేశారు. దేవరకద్ర మండలం మైనార్టీ నాయకుడు కుతుబుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా రేషన్ కిట్లను అందజేశారు. రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఇఫ్తార్ విందుకు దేవరకద్రకు విచ్చేసిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులతో కూడిన రంజాన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కుతుబుద్దీన్ మాట్లాడుతూ, రంజాన్ పండుగ సౌభ్రాతృత్వం, సేవా భావాన్ని పెంపొందించే పండుగ అని అన్నారు. పండుగ సందర్భంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మైనార్టీ కుటుంబాలకు కొంతైనా సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మైనార్టీ సోదరులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభ్యర్థి గెలుపులో బూత్ అధ్యక్షుని పాత్ర ముఖ్య భూమిక

- బిజెపి దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి
- రాణి పేటలో పండిత్ ఉపాధ్యాయ ప్రాశిక్షణ అభియాన్ సమావేశం

జయభేరి, దేవరకద్ర :



ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి గెలుపులో బూత్ అధ్యక్షుని పాత్ర ప్రధాన భూమిక పోషిస్తుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం రాణిపేటలో ఆదివారం నిర్వహించిన పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొండ ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీ స్థానికంగా బలోపేతం కావాలంటే కార్యకర్తలే ముఖ్యమని, బూత్ అధ్యక్షుల పాత్ర కూడా ఇందులో కీలకంగా ఉంటుందని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి గెలుపులో బూత్ అధ్యక్షుని పాత్ర ముఖ్య భూమిక ని పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు అమరేందర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహితి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ పద్మజా రెడ్డి, సంసద్ ఖేల్ ఇంచార్జ్ జనార్దన్ రెడ్డి, ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండ..

- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

జయభేరి, దేవరకొండ :

మల్లేపల్లి నుండి చింతపల్లికి వెళ్తున్నా క్రమంలో వాసురాం తండా దగ్గర ఆటో లారీ ఢీకొని ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 5 మందికి తీవ్ర గాయాలై దేవరకొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకొని 5 మంది క్షతగాత్రులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వారితో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రదీప్ గౌడ్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం నాగారంలో మృతి చెందిన నరసింహా రెడ్డి కుటుంబ సభ్యులను ఆదివారం నియోజకవర్గ సీనియర్ నాయకుడు కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా నరసింహ రెడ్డి పార్టీవ దేహం పై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

# రైల్వే టికెట్ను వేరొకరి పేరు మీదకు మార్చొచ్చు!

జయభేరి, న్యూ డిల్లీ, మార్చ్ 15:

;కన్ఫర్మ్ అయిన రైలు టికెట్పై ప్రయాణించే వ్యక్తి పేరును మార్చుకునే వెసులుబాటును రైల్వే కల్పిస్తోంది. మీ టికెట్ను మీ నాన్న, అమ్మ, బ్రదర్, సిస్టర్, కొడుకు, కూతురు లేదా భార్యా భర్తల పేరు మీదకు మార్చుకోవచ్చు. దీనికోసం ప్రయాణానికి 24 గంటల ముందే టికెట్, ID ప్రూఫ్ రిజర్వేషన్ ఆఫీసర్ను కలవాలి. ప్రభుత్వ ఉద్యోగులు, స్టూడెంట్స్, పెళ్లి బృందాలకు కూడా ఈ ఛాన్స్ ఉంది. ఈ మార్పు ఒక్కసారి మాత్రమే కుదురుతుంది.



# మన్నె జీవన్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జిఎంఆర్

జయభేరి, దేవరకద్ర :

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన మన్నె జీవన్ రెడ్డిని ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువా కప్పి జీవన్ రెడ్డికి ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం మహబూబ్ నగర్ జిల్లాలో ఎంతో నైపుణ్యత కలిగిన యువ క్రికెటర్లు ఉన్నారని, వారిలోని నైపుణ్యతను వెలికి తీసి వారికి సరైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని జీవన్ రెడ్డిని ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు.

# పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం తాటికొండలో ఆదివారం నూతన గ్రామపంచాయతీ భవన కార్యాలయాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మారుసుదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రారంభించారు. అలాగే పోనమోని కృష్ణమ్మ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే పాల్గొని ఇంటి యజమాలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గ్రామంలోని వీరభద్ర స్వామి గుడి వద్ద సిసి రోడ్డును ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిసి రోడ్డు దాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్
- దేవరకద్రలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



జయభేరి, దేవరకద్ర :

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర లోని జామె మజీదులో ఆదివారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు స్థానిక మైనార్టీ సోదరులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని ఉపవాస దీక్షలు ఉన్న ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్లు తినిపించి ఎమ్మెల్యే దీక్షలను విరమింప చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. ముందస్తుగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే జిఎంఆర్ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మైనార్టీ సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

అకాడమిక్ హైట్స్ నాచారంలో జరిగిన స్కూల్ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్న ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి స్పోర్ట్స్ మీట్ లు మరెన్నో నిర్వహించాలని ఆయన సూచించారు. క్రీడల్లో రాణించి సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ శివ కుమార్, BRS పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ శ్రీనివాస్ బంటి తదితరులు పాల్గొన్నారు.



# ప్రియా ప్రకాశ్ వారియర్ ట్రావెల్ ట్రిప్..

ఒరు ఆదార్ లవ్ సినిమాలో కన్నుగీటి ఓవర్‌నైట్ స్టార్ స్టేటస్ కొట్టేసింది మలయాళ ముద్దుగుమ్మ ప్రియా ప్రకాశ్ వారియర్. ఒక్క సినిమాతో ఫాలోవర్లను అమాంతం పెంచేసుకుంది. ఆ తర్వాత తెలుగులో చెక్, ఇష్క్.. నాట్ ఏ లవ్ స్టోరీ, బ్రో సినిమాల్లో మెరిసింది. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ అమ్మడు ప్రొఫెషనల్ కమిట్ మెంట్స్‌తో బిజీగా ఉంటూనే మరోవైపు సమయం దొరికినప్పుడల్లా తనకిష్టమైన ట్రావెలింగ్ చేస్తూ సరదా సమయాన్ని ఆస్వాదిస్తుంటుంది. తాజాగా ఈ భామ వెకేషన్ ఫొటోలు కొన్ని నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ ప్రియా వారియర్ ఎక్కడి కెళ్లిందబ్బా అనుకుంటున్నారా..? హాంకాంగ్ సిటీలో షికారు చేసింది. సిటీ రోడ్ల పక్కనున్న పుట్‌ఫాత్‌పై చక్కర్లు కొట్టింది. పార్కులోకి వెళ్లి చల్లని గాలిని ఆస్వాదిస్తూ లోకల్ ట్రైన్‌లో ప్రయాణించింది. హిల్ స్టేషన్ ఏరియాకు వెళ్లి అక్కడి అందాలను ఆస్వాదించింది. నైట్ టైంలో హాంకాంగ్ రోడ్లపై షికారు చేసింది. ట్రావెల్ పార్ట్‌నర్ సఫారీ ట్రావెల్స్‌తో కలిసి ట్రిప్‌ను సాగిందిందింది. ఈ ట్రిప్‌కు సంబంధించిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఇప్పుడీ ఫొటోలు ట్రావెల్ లవర్స్‌తోపాటు కుర్రకారును కట్టిపడేస్తున్నాయి.



# 98వ అకాడమీ అవార్డ్స్..

## సత్తా చాటిన ఫ్రాంకెన్‌స్టైన్ , సిన్నర్స్ , వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్


హాలీవుడ్ సినీ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డుల వేడుకగా పేరుగాంచిన 98వ అకాడమీ అవార్డ్స్ ఈసారి కూడా అట్టహాసంగా జరిగింది. ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానుల దృష్టిని ఆకర్షించిన ఈ అవార్డుల కార్యక్రమంలో పలు చిత్రాలు వివిధ విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుని ప్రత్యేక గుర్తింపు పొందాయి. ముఖ్యంగా 'ఫ్రాంకెన్‌స్టైన్', 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్', 'సిన్నర్స్' వంటి చిత్రాలు పలు కేటగిరీల్లో విజేతలుగా నిలిచి ఈ ఏడాది అవార్డుల వేడుకలో తమదైన ముద్ర వేశాయి. ఈ వేడుకలో టెక్నికల్ విభాగాల్లో 'ఫ్రాంకెన్‌స్టైన్' చిత్రం విశేషంగా మెరిసింది. ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ విభాగంలో ఈ చిత్రం అవార్డును దక్కించుకుంది. ఈ చిత్రానికి టమారా డెవరెల్ ప్రొడక్షన్ డిజైన్ నిర్వహించగా, షేన్ వియో సెట్స్ బాధ్యతలను సమర్థంగా నిర్వహించారు. ఈ విభాగంలో 'హామ్నెట్', 'మార్టీ సుప్రీమ్', 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్', 'సిన్నర్స్' చిత్రాలు కూడా నామినేషన్లు పొందాయి. అలాగే విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో 'అవతార్: ఫైర్ అండ్ అష్' చిత్రం విజేతగా నిలిచి మరోసారి తన సాంకేతిక ప్రతిభను చాటుకుంది. ఈ చిత్రానికి జో లెటెరి, రిచర్డ్ బెనెహామ్, ఎరిక్ సైన్డన్, డానియెల్ బారెట్ విజువల్ ఎఫెక్ట్స్ అందించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక వేడుకకు హాలీవుడ్‌తో పాటు ఇతర ఇండస్ట్రీలకు చెందిన సెలబ్రిటీలు హాజరై సందడి చేశారు. కళ్లు చెదిరే ఔట్‌ఫిట్స్‌ను ధరించి రెడ్‌కార్పెట్‌పై మెరవగా, వారికి సంబంధించిన పిక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా తన భర్తతో కలిసి రెడ్ కార్పెట్‌పై మెరవడం అందరి దృష్టిని ఆకర్షించింది.. ఉత్తమ సహాయ నటి: ఎమీ మాడిగన్ (వెపన్స్), ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్: కెపాప్ డెమన్ హంట్స్, ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్: ది గర్ల్ హు క్రైడ్ పెరల్స్, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్: ఫ్రాంకిన్ స్టన్, ఉత్తమ మేకప్ అండ్ హెయిర్ స్టైలింగ్: ఫ్రాంకిన్ స్టన్, ఉత్తమ క్యాస్టింగ్: వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్, ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్: ది సింగర్స్, టూ పీపుల్ ఎక్స్చేంజ్ సలైవా, ఉత్తమ స్క్రీన్‌ప్లే : ర్యాన్ కూగ్లర్, ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే: సిన్నర్స్, ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్: మిస్టర్. నోబడీ ఎగనెస్ట్ పుతిన్, ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్: ఆల్ ది ఎంప్టీ రూమ్స్.

# హోంబలే సినిమాలు అవేనట?



పానిండియా రెబల్‌స్టార్ ప్రభాస్‌తో ప్రతిష్టాత్మక చిత్రనిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మూడు సినిమాలు నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ప్రభాస్‌కు భారీ మొత్తంలో అడ్వాన్స్‌ను కూడా వారు అందించినట్టు ఓ వార్త కొన్నిరోజుల క్రితం మీడియాను షేక్ చేసింది. అయితే, ఆ మూడు సినిమాలు ఏంటి? దర్శకులెవరు? అనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. తాజా సమాచారం ప్రకారం ఈ వ్యవహారంపై క్లారిటీ వచ్చినట్టు తెలుస్తున్నది. ఈ మూడు సినిమాల్లో మొదటిది 'సలార్ 2: సౌర్యాంగపర్వం'. ప్రభాస్‌తో హోంబలే వారే 'సలార్' చిత్రాన్ని నిర్మించారు. ఆ సినిమా భారీ సక్సెస్ సాధించింది. ప్రభాస్‌తో వారు కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ముందు నిర్మించే సినిమా 'సలార్ 2' అని తెలిసింది. ఇక రెండో సినిమా.. మలయాళంలో కిష్కింధకాండ, ఏకో చిత్రాలను తెరకెక్కించిన దింజిత్ అయ్యథాన్ దర్శకత్వంలో ఉంటుందట. దీనికి సంబంధించిన కథను కూడా సదరు దర్శకుడు సిద్ధంచేశారట. అలాగే 'అమరన్'ఫేం రాజ్‌కుమార్ పెరియసామి కూడా ఇటీవలే ప్రభాస్‌కి ఓ కథ వినిపించారట. దాదాపు ప్రభాస్‌తో హోంబలే నిర్మించే మూడు సినిమాలు ఇవే అవుతాయని వినికిడి. అయితే ప్రభాస్ మాత్రం ప్రస్తుతం స్పిరిట్, ఫౌజీ, కల్కి 2 షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. అవి పూర్తయితే తప్ప నెక్స్ట్ కమిట్‌మెంట్స్ గురించి ఆయన ఆలోచించలేరు.

# పెద్ద హీరోలు, హీరోయిన్స్ లేరు



ఓటీటీల సినిమాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. ఎన్నో సూపర్ హిట్ సినిమాలు ఓటీటీలో దూసుకుపోతున్నాయి. ప్రతి వారం పదుల సంఖ్యలో ఓటీటీలోకి వచ్చి సందడి చేస్తున్నాయి. తెలుగు సినిమాలే కాదు డబ్బింగ్ సినిమాలు కూడా ఓటీటీలో దూసుకుపోతున్నాయి. లవ్ స్టోరీలు, హారర్, సస్పెన్స్, థ్రిల్లర్, మిస్టరీ చిత్రాలు చూసేందుకు జనాలు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా ఓ సినిమా ఓటీటీలో సెన్సేషన్ అవుతుంది. నిజానికి ఈ మూవీ థియేటర్లలో వచ్చినప్పుడు ఎవరూ అంతగా పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు ఈ తెలుగు రొమాంటిక్ సినిమాను చూసేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న సినిమా పేరు కన్యాకుమారి. కన్యాకుమారి.. ఈ చిత్రానికి సృజన్ అట్టాడ దర్శకత్వం వహించగా.. ఆగస్ట్ 17న థియేటర్లలో విడుదలైంది. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ మూవీ అంతగా రాణించలేకపోయింది. ఇటీవలే సెప్టెంబర్ 17న ఓటీటీలో రిలీజ్ అయ్యింది. ఇప్పుడు ఈ మూవీ ట్రెండింగ్ లో దూసుకుపోతుంది. స్టార్స్ లేకపోయినా అద్భుతమైన, ఎమోషనల్ కథతో దూసుకుపోతుంది. ఎలాంటి గ్లామర్ టచ్ లేకుండానే పల్లెటూరి నేపథ్యంలో వచ్చిన ఈ ప్రేమకథకు ఇప్పుడు యూత్ తెగ అట్రాక్ట్ అవుతున్నారు. ప్రేమ, జీవితం, బ్రేకప్ వంటి అంశాలతో ఈ సినిమా సాగుతుంది. ప్రస్తుతం ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ వీడియోస్, ఆహా ఓటీటీల్లో స్ట్రీమింగ్ అవుతుంది. ఇందులో గీత్ సైనీ ప్రధాన పాత్రలో నటించగా.. శ్రీచరణ్ హీరోగా నటించారు. రవి నిడమర్తి మ్యూజిక్, సినిమాటోగ్రఫీ సినిమాకు హైలెట్ అయ్యాయి. ప్రస్తుతం ఈ మూవీ క్లిప్స్ సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు జనాలు. ఈ సినిమాను ఓటీటీలో మిస్ అవ్వకండి.



# మై బాడీ, మై ఛాయిస్..!

తాజాగా ఓ ఇంటర్వ్యూలో అదితి మ్యాకల్ తన డ్రెస్సింగ్ స్టైల్ గురించి.. అలాగే తన వ్యక్తిగత అనుభవాలను పంచుకుంది. ముంబై నటీమణులు బోల్డ్ సన్నివేశాలు లేదా దుస్తులు ధరించినప్పుడు ప్రేక్షకులకు అంగీకారం ఉంటుందని, అదే ఒక తెలుగు అమ్మాయి చేస్తే జడ్జిమెంట్‌లు ఎదురవుతాయని చెప్పుకొచ్చింది. అమీతుమీ చిత్రం విడుదలైన వెంటనే తాను చేసిన బోల్డ్ ఫోటోషూట్‌లు అవకాశాల కోసం కాదని తెలిపింది. కేవలం బబ్లీ గర్ల్ పాత్రలు మాత్రమే కాకుండా విభిన్నమైన పాత్రలు చేయాలనుకుంటున్నానని తెలిపింది. బోల్డ్ ఫోటోషూట్‌లు ఒక పోర్ట్‌ఫోలియోలా పనిచేస్తాయని, పాత్రకు అవసరమైతే ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తాను కూడా బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు ఒకరు తనను లైంగికంగా వేధించిన సంఘటనను గుర్తుచేసుకుంది. ఆ సమయంలో కోయాక్టర్లు ఉన్నప్పటికీ తాను మాట్లాడలేకపోయానని, అది తనను బాధిస్తుందని.. నన్ను వేధించిన వ్యక్తి నవ్వుతూ వెళ్లిపోవడం చూసి బాధపడ్డానని తెలిపింది. క్లాసికల్ డ్యాన్స్ రీల్‌స్‌కు తక్కువ రీచ్ ఉంటుందని, కానీ బోల్డ్ ఫోటోషూట్‌లకు ఎక్కువ రీచ్ ఉంటుందని అదితి మ్యాకల్ తెలిపింది. ఇది తనకు బాధ కలిగిస్తుందని, ప్రజలు తమ మైండ్‌సెట్‌ను మార్చుకోవాలని.. దుస్తులు కాదు, మైండ్‌సెట్ ముఖ్యమని తెలిపింది. తాను పూర్తిగా బాడీ కవర్ అయ్యేలా దుస్తులు వేసుకున్నప్పటికీ తనకు వేధింపులు ఎదురయ్యాయని కరెక్ట్‌గా ఉన్నప్పుడు అవకాశాలు రానప్పుడు, తాను కోరుకున్న దుస్తులు వేసుకుంటానని.. ఇట్స్ మై బాడీ, మై ఛాయిస్ అని తెలిపింది. అలాగే తాను ఏ సన్నివేశం పడితే అది చేయనని, సినిమాకు అవసరమైతేనే చేస్తానని చెప్పుకొచ్చింది అదితి మ్యాకల్.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**